
# బీఆర్ఎస్‌కు 90 సీట్లు పక్కా

మొదటిపేజీ తరువాయి...

పేర్కొన్నాయి. మరోవైపు బీఆర్ఎస్‌కు మొదటి నుంచి వ్యతిరేకంగా ఉంటూ సామాజిక మాధ్యమాలను నడుపుతున్నవారు సైతం క్షేత్రస్థాయిలో ప్రజా స్పందనను చూసి చేతులెత్తేస్తున్నారు. 2014 ఎన్నికల్లో 63 స్థానాల్లో జయకేతనం ఎగురవేసి, 2018 ఎన్నికల్లో 88 స్థానాలను సొంతం చేసుకున్న బీఆర్ఎస్ ఈసారి ఏకంగా 90 స్థానాలను సాధించి.. తన రికార్డును తానే బ్రేక్ చేయబోతున్నట్టు తెలుస్తున్నది. దశాబ్దాలుగా దగాపడ్డ తెలంగాణ ఇప్పుడిప్పుడే దరికి చేరుతున్న క్రమంలో రాష్ట్ర ప్రజలు రిస్క్ తీసుకొని రాష్ట్రాన్ని మరొకరి చేతిలో పెట్టేందుకు సిద్ధంగా లేరని తేలిపోతున్నది. హైదరాబాద్ మహానగరం పరిధిలోని 22 స్థానాల్లో, ఉమ్మడి నిజామాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, కరీంనగర్, వరంగల్ జిల్లాలను బీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేయబోతున్నదని సర్వే సంస్థలు నిగ్గుతేలుస్తున్నాయి. ఇప్పటికే 60కి పైచిలుకు స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు తిరుగులేని ఆధిక్యంతో ముందుకు సాగుతున్నారు. ఇక త్రిముఖ పోటీ ఉన్న 15 నియోజకవర్గాలు, ద్విముఖ పోటీ ఉన్న 25 నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకే గెలుపు అవకాశాలు ఉన్నాయని చెప్తున్నారు. ఏ లెక్కచూసినా మొత్తం 90 స్థానాలతో బీఆర్ఎస్ ముచ్చటగా మూడోసారి విజయదుందుభి మోగించనున్నదనే సంకేతాలు బీఆర్ఎస్ శ్రేణుల్లో సమరోత్సాహాన్ని కలిగిస్తున్నాయి.



### ప్రజాబాహుళ్య దర్పణం కేసీఆర్

బీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ఇప్పటికే 86 ప్రజా ఆశీర్వాదసభలు నిర్వహించారు. ఈ సభలకు జనం తండోపతండాలుగా తరలివస్తున్నారు. వచ్చాం కాబట్టి విని ఊరుకుందాం అన్న రీతిలో కాకుండా సీఎం కేసీఆర్ చెప్పే ప్రతి మాటకు జోరుగా స్పందిస్తున్నారు. సందర్భం వచ్చినప్పుడు జై తెలంగాణ అంటూ నినదిస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే సభలే అయినా ఉద్యమకాలం నాటి సన్నివేశాలను ఆవిష్కరిస్తున్నాయి. బోనాలు.. బతుకమ్మలతో మహిళలు సభలకు పోటెత్తుతూ ఉద్యమస్ఫూర్తిని చాటుతున్నారు. ఈ సభలకు వస్తున్న జనం తిరిగి ఇండ్లల్లోకి వెళుతూ, వెళ్లిన తరువాత 'కేసీఆర్ చెప్పింది నిజమా? అబద్ధమా?' అంటూ.. వాడకట్టులో, కుల సంఘాల వారీగా జమకూడి చర్చిస్తున్నారు. ఫలితంగానే బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేని ఆధిక్యం లభించనుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

### మైనార్టీలు.. దళితులు బీఆర్ఎస్‌తో లేరనటం సత్యదూరం

బీఆర్ఎస్‌కు ఈసారి మైనార్టీలు, దళితులు దూరమయ్యారని కాంగ్రెస్ చెప్తున్నది పచ్చి అబద్ధమని తెలుస్తున్నది. దళితుల్లో అందరికీ దళితబంధు రాలేదని, ఈ కారణంతో ఆ వర్గం మొత్తం తమకే అనుకూలంగా ఉందని కాంగ్రెస్ పార్టీ ఆడుతున్నది మైండ్‌గేమ్ అని వారికి అర్థమైపోయింది. మూడోసారి ప్రభుత్వం రాగానే హుజూరాబాద్ మాదిరిగా నియోజకవర్గం అంతా దళితబంధు ప్రకటిస్తామని సీఎం కేసీఆర్ ఇస్తున్న హామీపై ఆ వర్గాల్లో భరోసా పెరిగింది. మైనార్టీల విషయంలో కూడా కాంగ్రెస్ ఆడుతున్నది మైండ్ గేమ్‌ను అది ఆ వర్గాలకు తెలిసిపోయింది. తెలంగాణలో ముస్లింల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నది. దీంతో ఆ వర్గం ఇప్పటికే అనేక చోట్ల బయటికి వచ్చి బీఆర్ఎస్ ర్యాలీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

## దింపుడుకల్లం ఆశలో దిగుబడి నేతలు

తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రజాదరణ ముందు ఢిల్లీ, బెంగళూరు శిబిరాలు కకావికలం అవుతున్నాయి. నిన్నటిదాకా అంతా తమ చేతుల్లోనే ఉందనుకొని నింపాదిగా చక్రాలు తిప్పిన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా సహా బీజేపీ అగ్రనాయకత్వం, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు ఖర్గే, రాహుల్, ప్రియాంక గాంధీ తదితరులు తెలంగాణ గడ్డ మీద వాలిపోయారు. ఇక రేవంత్‌రెడ్డి పేల్చుతున్న డైలాగ్‌లకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు బెంబేలెత్తిపోతున్నారు. రేవంత్ ఎంత తిరగకపోతే అంతమంచిది అని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ముఖం మీదే చెప్పేస్తున్నట్టు సమాచారం. మొత్తంగా బీఆర్ఎస్ పార్టీకి ఉన్న ప్రజాబలం, పార్టీ బలం, స్థానిక సంస్థల ప్రతినిధుల బలం ముందు కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న గారడీలు తెలిసిపోయి ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ముచ్చటగా మూడోసారి 90 సీట్లతో అధికారాన్ని కట్టబెట్టనున్నారని సర్వేలు తెలుపుతున్నాయి.

# అభివృద్ధిపై చర్చకు విపక్షాలు సిద్ధమా!

- కాంగ్రెస్, బీజేపీలకు దమ్ముంటే చర్చకు రావాలి
- కరెంటు, నీళ్లు, ఉద్యోగాలు.. దేనిపైనైనా రెడీ
- బీఆర్ఎస్ నేత పొన్నాల సవాల్



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అభివృద్ధిపై కాంగ్రెస్, బీజేపీ నేతలకు దమ్ముంటే చర్చకు రావాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య సవాల్ విసిరారు. బీఆర్ఎస్ నాయకులు డోకూరి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో పదేండ్లుగా ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ నేతలు ఎన్నికలకు పది రోజుల ముందు వరకూ అభ్యర్థులను వెతుక్కోవడం సిగ్గుచేటని విమర్శించారు. డబ్బులిచ్చిన వారికే టికెట్లు ఇచ్చిన వారు ప్రతిపక్షమని చెప్పుకోవడానికి సిగ్గు పడాలని అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కరెంటు, తాగునీరు, సాగునీరు, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలపై దేనికైనా చర్చకు సిద్ధమేని చెప్పారు. ఇంటి విషయాలు, విదేశీ వ్యవహారాలు తెలియని కేంద్ర మంత్రులు తెలంగాణకు వచ్చి అప్పులు, ఆదాయం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. చిదంబరం, నిర్మలా సీతారామన్, డీకే శివకుమార్ వంటి వారు కూడా ఎన్నికల వేళ కారుకూతలు కూస్తున్నారని, ఉద్యోగాల కల్పన, 24 గంటల కరెంటు, తలసరి ఆదాయం, అప్పుల్లో తెలంగాణ స్థానంపై తమతో చర్చించే దమ్ము ఉందా? అని ప్రశ్నించారు. ఇక్కడికి వచ్చి బీఆర్ఎస్ అధికారాన్ని ప్రశ్నించే నాయకులు.. ఏ అధికార దాహంతో తెలంగాణకు వచ్చారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలోనే తెలంగాణ అత్యధికంగా ఉద్యోగాలు కల్పించిందని, రైతులను ఆదుకున్నదని, వందలాది సంక్షేమ పథకాలు పేదల కోసం అమలు చేస్తున్నదని చెప్పారు. 'అప్పుడెట్లుండె తెలంగాణ.. ఇప్పుడెట్లున్నది తెలంగాణ. మీకు ధైర్యం ఉంటే చర్చకు సిద్ధం కావాలి' అని పొన్నాల సవాల్ విసిరారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు




## తెలంగాణలో కర్ణాటక ప్రభుత్వ ప్రకటనలా?

- రేవంత్, మైనంపల్లి భాష అభ్యంతరకరం
- కాంగ్రెస్ నాయకులపై చర్యలు చేపట్టాలి
- సీఈవో వికాస్‌రాజ్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తున్నదని బీఆర్ఎస్ ధ్వజమెత్తింది. ఈ ఉల్లంఘనలకు సంబంధించి శనివారం సీఈవో వికాస్‌రాజ్‌కు 6 అంశాలపై ఫిర్యాదు చేసింది. కర్ణాటక ప్రజల సొమ్ముతో తెలంగాణలో ఎన్నికల ప్రకటనలు ఇస్తున్న సిద్ధరామయ్య సర్కారుపై చర్యలు చేపట్టాలని కోరింది. ఎన్నికల ప్రచారంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న భాషపై అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ 11 వీడియోలను సమర్పించడంతోపాటు మంత్రి కేటీఆర్‌పై కారుకూతలు కూసిన మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావుపైనా ఫిర్యాదు చేసింది. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 32 మంది బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను కొనుగోలు చేయడంతోపాటు వారి కుటుంబసభ్యుల ఖాతాల్లో లక్షల రూపాయలు వేసిన కాంగ్రెస్ నేతలపై చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. ఎన్నికల సంఘం అనుమతి నిరాకరించిన ప్రకటనలను ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీతోపాటు ఆ ప్రకటనలను ప్రదర్శిస్తున్న యూఎఫ్‌వో మూవీస్ ఇండియా, క్యూబ్ సినిమాస్ సంస్థలపై చర్యలు చేపట్టాలని కోరింది. ఈ ఫిర్యాదుపై ఎన్నికల సంఘం స్పందించకపోతే కోర్టుకు వెళ్తామని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ స్పష్టం చేశారు.

# హైదరాబాద్ బీఆర్ఎస్‌దే

- 29 స్థానాలకు 20 స్థానాల్లో కొనసాగుతున్న కారు హవా
- పాతబస్తీని నిలుపుకోనున్న మజ్లిస్ పార్టీ
- కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ప్రజలు దూరం
- గులాబీ పార్టీకి కలిసొస్తున్న అభివృద్ధి అంశం
- రాష్ట్రంపైనా హైదరాబాద్ అభివృద్ధి ప్రభావం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): దక్షిణాదిలో తొలి హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ రికార్డు సృష్టించడంలో హైదరాబాద్ మహానగరం కీలక పాత్ర పోషించనున్నదా? జనాభా, శాసనసభ స్థానాలపరంగా నాలుగింట ఒక వంతుగా ఉన్న మహానగర (హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి) ఓటర్లు అధికార బీఆర్ఎస్‌కే మరోసారి బ్రహ్మరథం పట్టబోతున్నారా? 29 అసెంబ్లీ స్థానాలకు ఏకంగా 20 స్థానాల్లో గులాబీ జెండా రెపరెపలాడనున్నదా? తెలంగాణకు గుండెకాయ వంటి హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడంలో కేసీఆర్ ప్రభుత్వ కృషిని గుర్తించిన నగరవాసులు బీఆర్ఎస్ వైపే ఉన్నారా? ఆది నుంచి అంతంత మాత్రంగానే ఉన్న కాంగ్రెస్, బీజేపీ ప్రభావం ఇంకా మెరుగుపడలేదా? పాతబస్తీని ఈ సారి కూడా మజ్లిస్ పార్టీ నిలుపుకోనున్నదా? అంటే అవుననే అంటున్నారు రాజకీయ పరిశీలకులు.

### పురోగతికి నిదర్శనం హైదరాబాద్

ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక ఛోదక శక్తులు నగరాలే. హైదరాబాద్ మహానగరం తెలంగాణకే కాదు.. భారతదేశానికి కూడా బలమైన ఆర్థిక శక్తిగా ఉన్నది. గతానికి భిన్నంగా గడిచిన పదేండ్లలో బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ అనూహ్య అభివృద్ధి సాధించింది. ప్రపంచ ప్రఖ్యాత సంస్థల పెట్టుబడుల కేంద్రంగా నగరం నిలిచింది. శాంతిభద్రతల్లోనూ గంగా జమున తెహజీబ్‌కు ఆలవాలంగా మారింది. అందుకే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడుతున్నారు. తెలంగాణలోని ప్రతి గ్రామం నుంచి అనేక మంది విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం కోసం హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. రాష్ట్రంలోని లక్షల కుటుంబాల నుంచి కనీసం ఒకరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ నుంచి లక్షలాది మంది ఉద్యోగం, ఉపాధి కోసం ఇక్కడే స్థిరపడ్డారు. ఇలా వీరంతా నగరంలో గృహం, ఓపెన్ ప్లాటు, వ్యాపారం ఇలా వివిధ రూపాల్లో పెట్టుబడులు కూడా పెట్టారు. అందుకే వీరందరికీ కులం, మతం, ప్రాంతం మరీ ముఖ్యంగా రాజకీయాలతో పెద్దగా సంబంధం ఉండదు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ ఈ అంశాలు ప్రజలపై పెద్దగా ప్రభావం చూపవు. తమ ఆదాయ వనరులు పెరిగేందుకు సహకరించేలా నగరం ఉండటం వీరికి అత్యంత ముఖ్యం. నగరంలో ఉన్న సీమాంధ్రులతోపాటు కొత్తగా వచ్చి స్థిరపడిన వారేగానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏ ఒక్కరూ ఈ ప్రాంతాన్ని వీడినవారు లేకపోవడమే హైదరాబాద్ పురోగతికి నిదర్శనం.



### అభివృద్ధి యజ్ఞం ఆగొద్దంటున్న మహా నగర ఓటర్లు

తొమ్మిదిన్నర ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ ప్రగతి పరుగును చూసిన మహానగర ఓటర్లు ఈ అభివృద్ధి ఒరవడి ఆగిపోవద్దనే ధృఢ సంకల్పంతో ఉన్నారు. సాధారణంగా ఎన్నికలు వచ్చినపుడు రాజకీయంగా పొడసూపే కుల, మత, ప్రాంత, రాజకీయ అంశాలను వీరు ప్రామాణికంగా తీసుకోవడంలేదని క్షేత్రస్థాయి అధ్యయనం వెల్లడైనట్టు రాజకీయ పరిశీలకులు తెలిపారు. ముఖ్యంగా తమ పిల్లల భవిష్యత్తును రిస్క్‌లో పడనీయొద్దనే అప్రమత్తత ప్రజల నుంచి వ్యక్తమవుతున్నట్టు పేర్కొన్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ పరిధిలోని 15 స్థానాలతోపాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో మజ్లిస్ తన పాత ఏడు నియోజకవర్గాలను నిలబెట్టుకొనే అవకాశాలే ఎక్కువ కనబడుతున్నాయి. మిగిలిన 22 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఏకంగా 20 స్థానాలను కైవసం చేసుకోనున్నదని రాజకీయ నిపుణులు చెప్తున్నారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ప్రభావం ఈ ఎన్నికల్లో నామమాత్రంగానే ఉంటుందనే విషయం తేలిపోయిందని అంటున్నారు. దీని ప్రభావం రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాలపైనా ఉంటుందని భావిస్తున్నారు.

## గత ఎన్నికల్లోనూ అభివృద్ధి వైపే మొగ్గు

గత ఎన్నికల్లో హైదరాబాద్ ఓటర్ల తీర్పును పరిశీలిస్తే.. ఆది నుంచి ప్రజలు అభివృద్ధికే పట్టం కడుతున్నట్టుగా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2014 ఎన్నికల్లో 29 స్థానాలకు అప్పటి టీఆర్ఎస్ మూడు సీట్లే వచ్చాయి. ఐదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వ అభివృద్ధిని చూసి 2018 ఎన్నికల్లో 29 స్థానాలకుగాను ఏకంగా 19 స్థానాలను ఓటర్లు గులాబీ పార్టీకి కట్టబెట్టారు. మిగిలిన వాటిలో ఏడు స్థానాలు మజ్లిస్ పార్టీ ఖాతాలోకి వెళ్లాయి. జీహెచ్ఎంసీ ఎన్నికలను చూస్తే.. 2009 ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ పార్టీ పోటీలోనే లేదు. 2015లో జరిగిన గ్రేటర్ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 99 డివిజన్లను కైవసం చేసుకున్నది. 2020 ఎన్నికల్లో వరుసగా రెండోసారి గ్రేటర్ పీఠంపై గులాబీ జెండా ఎగిరింది. ఇతర పార్టీల పరిస్థితి చూస్తే... మజ్లిస్ మినహా మిగిలిన కాంగ్రెస్, బీజేపీది ప్రభావం నామమాత్రమేనని తేలింది. 2015 గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ నాలుగు, కాంగ్రెస్ రెండు స్థానాల్లో మాత్రమే విజయం సాధించాయి. 2020 ఎన్నికల్లో బీజేపీకి సీట్లు పెరిగినప్పటికీ కాంగ్రెస్ రెండు స్థానాలకే పరిమితమైంది. అభివృద్ధికే నగర ప్రజలు పట్టం కడుతున్న దరిమిలా తాజా ఎన్నికల్లో బీఆర్ఎస్ 20 స్థానాలను గెలుచుకోవడమనేది సులవేనని స్పష్టమవుతున్నది.

# దర్గాలు, వక్ఫ్ భూములపై చర్చకు సిద్ధమా?

- ఖురాన్‌పై ప్రమాణం చేద్దాం..వస్తారా?
- హోంమంత్రి మహమూద్‌అలీ సవాల్
- ముస్లింలను తప్పదోవ పట్టించొద్దని ప్రతిపక్షాలకు హితవు
- బీఆర్ఎస్ పాలనలోనే మైనార్టీల సంక్షేమమని స్పష్టం



శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ. చిత్రంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసీవుల్లా ఖాన్, బీఆర్ఎస్ నాయకులు బద్రుద్దీన్, అర్షద్‌అలీఖాన్, మునీర్‌భాయ్, షరీపుద్దీన్

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ హయాంలో దర్గాలను కూల్చివేశారని, వక్ఫ్ భూములను ఆక్రమించారని ఆరోపిస్తున్న నేతలు చర్చకు రావాలని హోంమంత్రి మహమూద్‌అలీ సవాల్ విసిరారు. ప్రతిపక్షాల ఆరోపణలకు సంబంధించి తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. పొంతనలేని ఆరోపణలు చేస్తూ.. ముస్లిం, మైనార్టీలను తప్పుదోవ పట్టించే నాయకులకు దమ్ముంటే చర్చకు రావాలని, ఖురాన్‌పై ప్రమాణం చేద్దామని, వస్తారా? అని ప్రశ్నించారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాలో ప్రతిపక్షాల ఆరోపణలను ఖండించారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం ముస్లింల కోసమే రూ.10,139.11 కోట్లను ఖర్చు చేసిందని, ఈ తరహా ముస్లింల సంక్షేమాన్ని కాంక్షించిన రాష్ట్రం, పార్టీ మన దేశంలో ఏదైనా ఉందా? అని హోంమంత్రి మహమూద్ అలీ ప్రశ్నించారు. ముస్లింలైనా, ముస్లిమేతరులైనా మసీదులను ధ్వంసం చేస్తే వెంటనే కేసులు పెట్టామని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే మూతపడిన మైనార్టీ ఇంజినీరింగ్ కాలేజీలు పునఃప్రారంభమయ్యాయని తెలిపారు. చారిత్రక ముస్లిం కట్టడాలను కూల్చివేశారని అబద్ధాలు వల్లవేస్తున్న కాంగ్రెస్ నాయకులు నిజానిజాలు తెలుసుకోవాలని కోరారు. నేటికీ ఉస్మానియా, ఎర్రమ్ మంజిల్, నిజామియా మెడికల్ కాలేజీ, మెటర్నిటీ హాస్పిటల్, ఉస్మాన్‌సాగర్, సఖల్‌సాగర్ చెక్కు చెదరకుండా ప్రభుత్వమే ప్యాచ్‌వర్క్‌లు చేస్తూ కాపాడుతున్నట్లు చెప్పారు.

## కాంగ్రెస్ 2 కోట్లు.. బీఆర్ఎస్ 10 వేల కోట్లు

2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల కోసం కేవలం రూ.2,219 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని, ఈ విషయాన్ని ముస్లిం, మైనార్టీ సోదరులు అర్థం చేసుకోవాలని హోంమంత్రి హితవు పలికారు. బీఆర్ఎస్ 2023-24 బడ్జెట్‌లో రూ.2,200 కోట్లు కేటాయించిందని చెప్పారు. పొంతనలేని ఆరోపణలు చేస్తూ.. ముస్లిం, మైనార్టీలను తప్పుదోవ పట్టించే నాయకులకు దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక, హజ్‌యాత్ర, దర్గాల అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రభుత్వం ఎంతో చేస్తున్నదని, ప్రతిపక్షాల ఆరోపణలను మైనార్టీ సమాజం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ మసీవుల్లా ఖాన్, బీఆర్ఎస్ నాయకులు బద్రుద్దీన్, అర్షద్‌అలీఖాన్, మునీర్‌భాయ్, షరీపుద్దీన్ పాల్గొన్నారు.

